www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 27 నవంబర్ 2023

క్రీడాకారిణికి ఆర్థిక చేయూత

ఆర్థిక సాయం చేస్తున్న ట్రస్ట్ సభ్యులు

కమలాపురం : కమలాపురం పట్టణం నుంచి ప్రపంచ స్కిప్పింగ్ ఛాంపియన్‌షిప్ థాయిలాండ్ ఎంపికైన పేద కుటుంబానికి చెందిన కావేటి భవ్య శ్రీకి కామెంట్ ఛారిటబుల్ ట్రస్ట్ సభ్యులు దాతల సహ కారంతో రూ. 16 వేల ఆర్థిక సహాయం అందించారు. ఆదివారం ట్రస్ట్ సభ్యుడు రాజారెడ్డి మాట్లాడుతూ ప్రపంచ స్కిప్పింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలకు థాయిలాండ్‌కు కమలాపురం పట్టణం నుంచి ఎంపిక కావడం ముఖ్యంగా క్రీడాభిమానులకు చాలా సంతోషకరమన్నారు. క్రీడాకారిణి తండ్రి రామకృష్ణ మాట్లాడుతూ తన కూతురు కావేటి భవ్యశ్రీ కి ఆర్థిక సాయం చేసి దాతలు ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియ జేశారు. కార్యక్రమంలో మధర్ తెరిసా సేవా సమితి ఛారిటబుల్ ట్రస్ట్ జూటూరు విజయకుమార్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

సచివాలయాల నిర్మాణాలను పూర్తి చేస్తాం

కొండాపురం-సిరిగేపల్లి బ్రిడ్జికి ప్రాధాన్యత
పంచాయతీరాజ్ సూపరింటెండెంట్ ఇంజినీర్ జి.వి.శ్రీనివాసులరెడ్డి

ముఖా ముఖి..

ప్రజాశక్తి - కడపప్రతినిధి

సకాలంలో సచివాలయ నిర్మాణాలను పూర్తి చేస్తాం. ఆర్‌బికె, వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్స్, పాడా నిధులతో పాల సేకరణ కేంద్రాలు, అగ్రికల్చరల్ మార్కెటింగ్ కమిటీ నిధులతో మౌలిక వసతుల కల్పనలో గణనీయమైన పురోగతి సాధించాం. 2023 డిసెంబర్ నుంచి మార్చి నాటికి మౌలిక వసతుల కల్పనను పూర్తి చేయడమే లక్ష్యం. వీటితోపాటు జిల్లాలోని వేంపల్లి బ్రిడ్జిల నిర్మాణ పనులు ముగింపు దశలో ఉంది. సిరిగేపల్లి బ్రిడ్జి నిర్మాణానికి గండికోట బ్యాక్‌వాటర్ ముంపు సమస్య కారణంగా నిలిచి పోయింది. బ్యాక్ వాటర్ తగ్గుముఖం పట్టిన నేపథ్యంలో పురోగతిపై ఆలోచన చేయాల్సి అవసరం ఏర్పడనుంది. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో మెరుగైన వసతుల కల్పనపై దృష్టి సారించామని పేర్కొంటున్న పంచాయతీరాజ్ సూపరింటెండింగ్ ఇంజినీర్ జి.వి. శ్రీనివాసులరెడ్డితో ముఖాముఖి...

వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్ ప్రోగ్రెస్ ఎలా ఉంది?

రూ.48 కోట్లతో 343 వైఎస్ఆర్ హెల్త్‌క్లినిక్స్ నిర్మాణాలను చేపట్టాం. ఇందులో దాదాపు హెల్త్‌క్లినిక్స్ భవన నిర్మాణ పనులు ముగింపు దశలో ఉన్నాయి. ఈయేడాది డిసెంబర్, మార్చి మాసాల మధ్య నాటికి మిగిలిన నిర్మాణాలను పూర్తి చేయాలని సంకల్పంతో ముందుకెళ్తున్నాం.

సచివాలయ భవన పురోగతి చెప్పండి?

జిల్లాలో రూ.158 కోట్లతో 426 సచివాలయ నిర్మాణ పనులు చేపట్టాం. 303పైగా భవన నిర్మాణ పనులు పూర్తి చేశాం. సుమారు 81 శాతం మేర పురోగతి సాధించాం. మిగిలిన 123 సచివాలయ నిర్మాణ పనులను డిసెంబర్, మాసాల నెలాఖరు నాటికి పూర్తి చేయడంపై దృష్టి సారించాం.

ఆర్‌బికెల స్థితిగతులేమిటి?

రూ.75 కోట్లతో 417 రైతు భరోసా కేంద్రాల నిర్మాణ పనులు చేపట్టాం. ఇందులో 210పైగా రైతు భరోసా కేంద్రాల నిర్మాణ పనుల్ని పూర్తి చేశాం. ఇప్పటికి 70 శాతం పనులు చేపట్టాం. డిసెంబర్, మార్చి మాసాల నాటికి అందుబాటులోకి తేవడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నాం.

పాడా పనుల గురించి తెలపండి?

పులివెందుల ఏరియా అథారిటీ డెవలప్‌మెంట్ కింద పంచాయతీరాజ్ పరిధిలో రూ.210 కోట్లతో 1470 పనులు చేపడుతున్నాం. ఇందులో 569 సిసిరోడ్లు, కల్వర్టులు తదితర పనులు పూర్తి చేశాం.

సిరిగేపల్లి బ్రిడ్జి ప్రశ్నార్థకమేనా?

కొండాపురం–సిరిగేపల్లి బ్రిడ్జి పనులు తా త్కాలికంగా నిలిపేశాం. గండి కోట జలాశయం బ్యాక్‌వాటర్ కారణంగా పురోగతి లేదు. వెనుక జలాలు తగ్గిన వెంటనే పనులను వేగవంతం చేస్తాం.

వేంపల్లి బ్రిడ్జి నిర్మాణ పనుల గురించి తెలపండి?

వేంపల్లి బ్రిడ్జి నిర్మాణం ముగింపు దశకు చేరుకుంది. గతేడాది పాపాఘ్ని నదికి వచ్చిన వరదల కారణంగా బ్రిడ్జి శ్లాబ్ మూత పనుల్ని వాయిదా వేయాల్సి వచ్చింది. ఈయేడాది మార్చి నాటికి పనుల్ని పూర్తి చేయడంపై దృష్టి సారించాం.

రాజ్యాంగ పరిరక్షణ మనందరి బాధ్యత : జెసి

అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న జెసి గణేష్‌కుమార్

ప్రజాశక్తి - కడప

భారత రాజ్యాంగ పరిరక్షణ మన అందరి బాధ్యత అని, అందుకు ప్రతి భారతీయుడు తన వంతు కృషి చేయాలని జిల్లా జయింట్ కలెక్టర్ జి.గణేష్ కుమార్ పేర్కొన్నారు. ఆదివారం 74వ భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్ ప్రాంగణంలోని భారత రత్న డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి జిల్లా జయింట్ కలెక్టర్ జి.గణేష్ కుమార్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్పందన హాలులో ఏర్పాటు చేసిన సభా కార్యక్రమంలో జెసి మాట్లాడుతూ రాజ్యాంగ పరిరక్షణకు భారతీయ పౌరుడిగా కృషి చేయడం మన బాధ్యత అన్నారు. అన్నివర్గాల ప్రజల సంక్షేమం, అభివృద్ధి, అభ్యున్నతిని కాంక్షించి రచించిన రాజ్యాంగ గ్రంథాన్ని 26 నవంబర్ 1949న జాతికి అంకితం చేసి రాజ్యాంగ నిర్మాతగా ప్రపంచ చరిత్రలో చిరస్థాయిగా నిలిచారన్న విషయాన్ని మనం స్మరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇదే రోజును జాతీయ న్యాయ దినోత్సవం, వరకట్న వ్యతిరేక దినోత్సవాలను కూడా నిర్వహిస్తోందన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్ గౌడ్ లతో పాటు డిప్యూటీ కలెక్టర్లు కౌసర్ భాను, ప్రత్యూష, మైనారిటీ కార్పొరేషన్ ఇడి డాక్టర్ వల్లూరు బ్రహ్మయ్య, ఆర్‌అండ్‌బి ఎస్ఇ మహేశ్వర్ రెడ్డి, కలెక్టరేట్ ఎఒ విజయ్‌కుమార్, అన్ని విభాగాల సూపరింటెండెంట్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. **ఆర్ట్స్ కళాశాలలో..** ప్రభుత్వ పురుషుల కళాశాల స్వయం ప్రతిపత్తి కడప ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ఆదివారం భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ జి రవీంద్రనాథ్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం రమేష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ వై. సావిత్రి, శివరామకృష్ణ, డాక్టర్ అంకాల నాగరాజు భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో భాగంగా వై సావిత్రి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి, అధ్యాపకులు, విద్యార్థులు పేర్కొన్నారు.

నవభారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యావత్ ప్రపంచానికి ఆదర్శనీయమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎస్.బి. అంజాద్‌బాషా పేర్కొన్నారు. ఆదివారం స్థానిక మాసాపేట కూడలిలో పల్లెకొండు సంపత్ కుమార్ ఆధ్వర్యంలో 74వ భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. **ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో** రాజ్యాంగ దినోత్సవం(లా డే), వరకట్న వ్యతిరేక దినోత్సవం సందర్భంగా న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శాంత, ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ శ్రీమతి సిహెచ్ జ్యోతి, ఫిజికల్ డైరెక్టర్ నాగమ్మ, హెడ్ ఆఫ్ ది ఫార్మసీ సెక్షన్ సుజాత, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

కడప అర్బన్ : భారత ప్రజాస్వామ్య పాలనకు రాజ్యాంగ రచనలు పొందు పరచి దేశ ప్రజల ఎనలేని కీర్తి గడించిన మహనీయుడు డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ అని టిడిపి జిల్లాఅధికార ప్రతినిధి ఆమూరి బాలదాసు అన్నారు. కలెక్టరేట్ లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. టిడిపి కడప అసెంబ్లీ నియోజకవర్గ మాజీ ఇన్‌ఛార్జి వి.ఎస్. అమీర్ బాబు కార్యాలయంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో నగర ఉపాధ్యక్షులు కొండా సుబ్బయ్య, లింగాల శివశంకర్ రెడ్డి, రాయల్ కరిముల్లా, శేషయ్య నాయుడు, నాగేంద్ర నాయుడు, జిల్లా యువజన ఉపాధ్యక్షులు రహిమాన్, రమణారెడ్డి, బండారు ప్రసాద్ పాల్గొన్నారు. **కలసపాడు :** యోగివేమన పాలక మండల మాజీ సభ్యురాలు. ఎన్. డి. విజయ జ్యోతి ఆదివారం భారత రాజ్యాంగ నిర్మాత అయిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు అనంతరం ఆమె మాట్లాడుతూ మన భారత రాజ్యాంగం ప్రపంచంలోనే అతిపెద్ద రాజ్యాంగమైన, కూడా అతి తక్కువ రోజుల్లో రచించిన ఘనత బాబా సాహెబ్ అంబేద్కర్ దే అని ఆమె కొనియాడారు. కార్యక్రమంలో మండల ఎస్సీ ఎస్టీ, బిసి, మండల నాయకులు పాల్గొన్నారు.

అంబేద్కర్ రాజ్యాంగానికి తిలోదకాలు : సిపిఎం

ప్రజాశక్తి - కడప అర్బన్

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అంబేద్కర్ స్టేట్ సోషలిజానికి తిలోదకాలు ఇచ్చిందని సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ విమర్శించారు. ఆదివారం భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా సిపిఎం కార్యాలయంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో మనువాద ఫాసిస్ట్ శక్తులు అధికారంలోకి వచ్చి కూర్చున్నాయని పేర్కొన్నారు. వీరికి ప్రత్యామ్నాయం ప్రగతిశీల శక్తుల మైత్రి రావాలన్నారు. దేశంలో ప్రగతి నిరోధక సనాతన ధర్మాల ప్రచారం చేసే పాలక ప్రభుత్వాలు వచ్చి అభ్యుదయ భావాలకు తిలోధకాలిస్తున్నాయని చెప్పారు. సమాజాన్ని పురోగమనం వైపు కాకుండా తిరోగమనం వైపు నడిపిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు సునీల్, రాజేంద్రప్రసాద్, ఉపాధ్యక్షులు రాహుల్, సురేష్ పాల్గొన్నారు.

చలో ఢిల్లీని జయప్రదం చేయాలని సంతకాల సేకరణ

ప్రజాశక్తి -వల్లూరు

సంతకాలు సేకరిస్తున్న వ్య.కా.స నాయకులు అన్వేష్

సామాజిక హక్కులు, ఆర్థిక భూమి సమస్యలు తదితర 22 డిమాండ్ల పరిష్కారం కోరుతూ తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి వి.అన్వేష్ పిలుపు నిచ్చారు. ఆదివారం మండలంలోని దళిత పేటలో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 76 ఏళ్ల స్వతంత్ర భారతదేశంలో నేటికీ దళితులపై దాడులు అత్యాచారాలు మానభంగాలు జరుగుతూనే ఉన్నాయని వాపోయారు. మణిపూర్‌లో మనువాదుల చేతుల్లో ఇద్దరు మహిళలను నగ్నంగా ఊరేగించి అత్యాచారం చేయడం యావత్ భారతదేశాన్ని తలదించుకునేలా చేసిందని తెలిపారు. ఇంత జరిగిన మతోన్మాద ప్రధానమంత్రి మోడీ పల్లెత్తు మాట మాట్లాడకపోవడం దాడులు చేసిన వారికి రక్షణ కల్పించడం సిగ్గుచేటు అన్నారు. బిజెపి రెండో సారి అధికారంలోకి వచ్చిన తర్వాత సబ్ ప్లాన్ చట్టాన్ని రద్దు చేసిందని రిజర్వేషన్లను అమలు జరపకుండా అనేక ప్రయత్నాలు చేస్తుందని తెలిపారు. మనువాద భావజాలాన్ని అమలు చేసి లౌకిక రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేసే కుట్ర పన్నుతుందని తెలిపారు. దళితుల హక్కులను పాలక పక్షాలు హరించి వేస్తున్నాయని ఎస్‌సి, ఎస్‌టి, బ్యాక్లాగ్ పోస్టులను భర్తీ చేయకుండా దళితులకు ద్రోహం చేస్తున్నారని పేర్కొన్నారు. దళిత హక్కులు సామాజిక ఆర్థిక భూమి సమస్యల పరిష్కారం కోసం తో పాటు 22 డిమాండ్ల సాధన కోసం రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయ కార్మిక సంఘం కెవిపిఎస్ ఉద్యమం చేపడుతున్నాయని డిసెంబర్ 4న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని చేపట్టనున్నామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగ సంతకాల సేకరణ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి సుబ్బయ్య, వ్యవసాయ కార్మిక సంఘం వల్లూరు మండల నాయకులు సుబ్బారాయుడు, హరి, వెంకటరమణ పాల్గొన్నారు

ఉపాధ్యాయులపై వేధింపులు ఆపాలి

-ఫ్యాప్టో జిల్లా ఛైర్మన్ మాదన విజయకుమార్

ప్రజాశక్తి-బద్వేల్

ఉపాధ్యాయులను నిరంతరం ఏదో ఒక రకంగా వేధించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖాధికారుల వైఖరి కొనసాగుతోందని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) కడప జిల్లా ఛైర్మన్ మాదన విజయకుమార్ పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఉపాధ్యాయులను వేధించడమే లక్ష్యంగా పాలన సాగుతుందోని వాపోయారు. మెరుగైన పిఆర్‌సి సాధన, సిపిఎస్ రద్దు కోసం గతంలో ఉపాధ్యాయులు ఉద్యమించారనే కక్షతో వారిని వేధించడం నిత్య కృత్యమైందన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా పాఠశాలల పర్యవేక్షణ పేరుతో అధికారులు నిరంతరం ఉపాధ్యాయులను వేధిస్తూ తీవ్ర ఒత్తిడిలకు గురి చేస్తున్నారని చెప్పారు. అధికారులు పాఠశాలల పర్యవేక్షణకు తాము వ్యతిరేకం కాదని, అయితే పర్యవేక్షణ పేరుతో ఉద్దేశపూర్వకంగా ఉపాధ్యాయులను వేధించడానికి వ్యతిరేకమన్నారు. పాఠశాల విద్య ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ కొంతకాలంగా పాఠశాలలను తనిఖీ చేస్తూ ఉపాధ్యాయులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. తనిఖీల సందర్భంగా కనిపించే చిన్న చిన్న లోపాలను స్నేహపూరిత వాతావరణంలో సలహాలు ఇచ్చి చక్కదిద్దాలే తప్ప, చిన్నచిన్న కారణాలకు ఇంక్రిమెంట్లు కట్ చేయడం, సస్పెన్షన్లకు పాల్పడటం తగదన్నారు. విద్యార్థులు నోట్ బుక్స్ రాయలేదని, వర్క్ బుక్స్ పూర్తి చేయలేదని, ఉపాధ్యాయులు సిలబస్ పూర్తి చేయలేదని పేర్కొంటూ ఒక వారంలోపే ఒంగోలు జిల్లాలో 148 మందికి, నెల్లూరు జిల్లాలో 54 మందికి, గుంటూరు జిల్లాలో 30 మందికి చార్జి మెమోలు, షోకాజు నోటీసులు జారీ చేశారన్నారు. క్షేత్రస్థాయిలో సమస్యలు పట్టించుకోకుండా ఉపాధ్యాయులపై కక్ష సాధింపులకు పాల్పడటం ఎంతవరకు సబబని ఆయన ప్రశ్నించారు. పాఠ్యాంశాలను బోధించడం, నోట్ పుస్తకాలను పరిశీలించడం, పరీక్షలు నిర్వహించడం ఉపాధ్యాయ వృత్తిలో భాగమేనన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖాధికారులు ఉపాధ్యాయులను వేధించడం మానుకొని ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ కోసం కృషి చేయాలన్నారు. ఉపాధ్యాయులను వేధించడమే లక్ష్యంగా కొనసాగితే ఈ ప్రభుత్వం భారీ మూల్యం చెల్లించక తప్పదని ఆయన హెచ్చరించారు.

అమరాన్ లూబ్రికెంట్స్‌లో తనదైన ముద్ర

- మేనేజర్ మనిష్ తులి

ప్రజాశక్తి - కడప అర్బన్

మీడియాతో మాట్లాడుతున్న మనిష్‌తులి

అమరాన్ కంపెనీ బ్యాటరీ రంగం లోనే కాక తాజాగా లూబ్రికెంట్స్ రంగంలో కూడా తనదైన ముద్ర వేసుకుందని ఆర్మ్‌డ్ ప్రొడక్ట్ మేనేజర్ మనిష్ తులి తెలిపారు. ఆది వారం ఆదిత్య బెన్ క్యూలో కంపెనీ డీలర్స్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ అమరాన్ లూబ్రిస్ పేరుతో పలు రకాల కొత్త ఉత్పాదనలను మార్కెట్‌లోకి తీసుకువచ్చిందని చెప్పారు. వాటిని వినియోగదారులకు అందించే క్రమంలో రీటైల్ వ్యాపారులు, మెకానిక్, సంబంధిత వర్గాలకు అవగాహన కల్పించామని పేర్కొన్నారు. అమరాన్ బ్యాటరీ కంపెనీ ప్రపంచ మార్కెట్‌లో తనకంటూ ఒ స్థానాన్ని బ్యాటరీ ఉత్పాదనలో సంపాదించుకుందని తెలిపారు. ఇదే తరహాలో లూబ్రికెంట్స్‌లో కూడా రాణించేందుకు అడుగులు ముందుకేస్తుందని చెప్పారు. సమాజ ప్రగతిలో అమరాన్ కూడా ఒక బెంచ్ మార్క్‌లా ఉంటుందన్నారు. సమావేశంలో లూప్స్ హెడ్ తివిక్రమ్‌రెడ్డి, అమరాన్ రీజనల్ హెడ్ ఎన్.సి.నాయుడు, బ్రాంచ్ మేనేజర్ శ్రీనివాసు, బ్రాంచ్ సర్వీస్ మేనేజర్ గోవర్ధన్‌రెడ్డి, సర్వీస్ మేనేజర్ ఖాదర్‌హుసెన్, హరిచరణ్, జయసూర్య, దొరబాబు, పరమేశ్వరి, రంజిత్ కుమార్ పాల్గొన్నారు.

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న సినీ హీరో సత్యారెడ్డి

'ఉక్కు సత్యాగ్రహం'ను ఆదరించండి

- సినీ హీరో సత్యారెడ్డి

ప్రజాశక్తి - కడప అర్బన్

రాష్ట్రాన్ని, దేశాన్ని బిజెపి నాశనం చేస్తుందని, ఎపికి ప్రత్యేక హోదా ఇవ్వకపోగా ఇక్కడ ఎంతో మంది నిరు ద్యోగు లకు ఉపాధిగా ఉండే విశాఖ ఉక్కును ప్రయివే టీకరణ చేయడం దారుణమని 'ఉక్కు సత్యాగ్రహం' సినిమా హీరో, దర్శకుడు సత్యారెడ్డి అన్నారు. ఆదివారం ఉక్కు సత్యాగ్రం సినిమా విడుదల కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రచార బస్సు యాత్రలో నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హీరో, దర్శకుడు, రచయితగా తాను యుద్ధ నౌక గద్దర్‌ను స్ఫూర్తిగా తీసుకుని 52 సినిమాలు చేశానన్నారు. గద్దర్ కూతురు వెన్నెలతో ఈ నెల 24న బంజారా హిల్స్‌లోని ప్రసాద్ ల్యాబ్ హైదరాబాద్‌లో బస్సుయాత్ర ప్రారంభించామని తెలిపారు. రాయలసీమ నడిఒడ్డున ఉన్న కడపకు యాత్ర చేరుకోవడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. తమ సినిమాలో 4 పాటలు గద్దర్ రచించి, పాడి రెండు పాటలలో నటించారని తెలిపారు. నేటి సమాజంలో యువతలో ప్రశ్నించే అలవాటు పోయిందని పేర్కొన్నారు. ఈ సినిమా వల్ల ఆ ఆలోచన మారుతుందన్నారు. బీహార్‌లో నితీష్ ప్రభుత్వం ప్రత్యేకహోదా కోసం నేటికి పోరాటం చేస్తుందన్నారు. బిజెపికి రాష్ట్రంలో ఒక్క ఎంపి, ఎంఎల్‌ఎ సీటు లేకున్నా అధికార, ప్రతిపక్షాలు బిజెపికి వంత పాడుతున్నాయని చెప్పారు. విశాఖ ఉక్కు ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా ప్రతి ఒక్కరు పోరాటంలో భాగస్వాములు కావాలని పిలుపు నిచ్చారు. సమావేశంలో సినిమా సిబ్బంది రఘునాథ్, ఏసోబు, వెంకటేష్, అరుణ్ పాల్గొన్నారు.

'చంద్రబాబుతోనే అభివృద్ధి సాధ్యం'

ప్రజాశక్తి - కడప అర్బన్

కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాధవిరెడ్డి

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ పోలిట్ బ్యూరో సభ్యులు ఆర్. శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆదివారం చెమ్ముమి యాపేటలో మాజీ సర్పంచ్ పుత్తా వెంక టలక్ష్మి, వెంకటసుబ్బారెడ్డితో పాటు పలువురు వైసిపి నుంచి టిడిపిలో చేరారు. వీరిని కడప నియోజకవర్గ ఇన్‌ఛార్జి మాధవిరెడ్డి పార్టీ కండువా వేసి ఆహ్వా నించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం రాష్ట్రానికి చేసింది ఏమిలేదని పేర్కొ న్నారు. డిప్యూటీ సిఎం అంజాద్‌బాష అభివృద్ధి ముసుగులో కోట్లాది రూపాయలు ఆర్జించారని చెప్పారు. పేదల ఇళ్లు కూల్చి రోడ్లు విస్తరణ చేస్తున్నారని తెలిపారు. వైసిపి నాయకుల ఇళ్లు అక్కడా పోలేదన్నారు. వాలంటీర్లు ప్రభుత్వ ఉద్యోగులు కారని పేర్కొన్నారు. ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదని చెప్పారు. కడప నుంచి మహిళగా పోటీ చేస్తున్న తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్.గోవర్ధన్‌రెడ్డి, జిలానీ బాష, డాక్టర్ కృష్ణకిషోర్, కృష్ణారెడ్డి, మాసాపేట శివ, డివిజన్ నాయకులు ఖాజా, రామలక్ష్మమ్మ పాల్గొన్నారు.

వివేకానంద అనాథాశ్రమంలో అన్నదానం

ప్రజాశక్తి-కాశినాయన

గంగనపల్లె సర్పంచ్ బసిరెడ్డి ప్రభాకర్ రెడ్డి తన తండ్రి బసిరెడ్డి సుబ్బారెడ్డి 9వ వర్ధంతి సందర్భంగా మండల పరిధిలోని ఓబులాపురం సగిలేరు వద్ద ఉన్న వివేకానంద అనాథాశ్రమంలో అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ జయంతి, వర్ధంతులు గొప్పగా చేసుకునే కంటే అనాథలకు ఒక పూట భోజనం పెడితే ఎంతో ఆనందంగా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో ఆయన సతీమణి నాగమణి ఆశ్రమ నిర్వాహకులు రామకృష్ణారెడ్డి, రామతులసమ్మ పాల్గొన్నారు

అన్నదానం చేస్తున్న బసిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

272 పరుగులకు నార్త్ జోన్ జట్టు అలౌట్

ప్రజాశక్తి - కడప

జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎసిఎ అండర్–23 మల్టీ డే ఇంటర్ జోనల్ క్రికెట్ టోర్నీలో కెఒఆర్ఎం క్రికెట్ మైదానంలో ఆదివారం నిర్వహించిన మ్యాచ్‌లో నార్త్ జోన్ జట్టు మొదటి ఇన్నింగ్స్ లో 59.3 ఓవర్లలో 272 పరుగులు చేసింది. ఆ జట్టులోని రవి కిరణ్ 97 పరుగులు చేశాడు. రెస్ట్ ఆఫ్ జోన్ జట్టులోని చెన్నారెడ్డి 4, జానీ భాష 5 వికెట్లు తీసుకున్నారు. అనంతరం రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన రెస్ట్ ఆఫ్ జోన్ జట్టు ఆట ముగిసే సమయానికి 58.0 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 137 పరుగులు చేసింది. ఆ జట్టులోని రేవంత్ రెడ్డి 63 (నాటౌట్ పరుగులు చేశాడు. **ధరణి కుమార్ నాయుడు సెంచరీ ..** కెఎస్ఆర్ఎమ్ క్రికెట్ మైదానంలో జరుగుతున్న వేరొక మ్యాచ్‌లో ధరణి కుమార్ నాయుడు సెంచరీ చేయడంతో సబ్ జోన్ జట్టు మొదటి ఇన్నింగ్స్ లో 362 పరుగులు చేసింది. ఒక వికెట్ నష్టానికి 82 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో రెండవ రోజు బ్యాటింగ్ ప్రారంభించిన సౌత్ జోన్ జట్టు 92.2 ఓవర్లలో 362 పరుగులు చేసింది. ఆ జట్టులోని ధరణి కుమార్ నాయుడు 133 పరుగులు (సెంచరీ) చేశాడు. వంశీకృష్ణ 69, యోగానంద 65 పరుగులు చేశారు. సెంట్రల్ జోన్ జట్టులోని సాయి వెంకట సుమిత్ 3, భువనేశ్వర్ 2 వికెట్లు తీసుకున్నారు. అనంతరం రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన సెంట్రల్ జట్టు ఆట ముగిసే సమయానికి 13.1 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 36 పరుగులు చేసింది.

పుష్పగిరిలో పంచ నది హారతి

వల్లూరు : పవిత్ర పుణ్యక్షేత్రం పుష్పగిరిలో కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని పంచ నది హారతి నిర్వహించామని ఆలయ ప్రధాన అర్చకులు తెలిపారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ పుష్పగిరి పెన్నా నది ఒడ్డున ఆశా రేఖ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కార్తీకదీపం కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించామన్నారు. ఉదయం నుంచి భక్తులు శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి వైద్యనాథేశ్వర స్వామిని దర్శించుకున్నారన్నారు. మహిళలు దీపాలు వెలిగించారని చెప్పారు.

దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి - కడప

కడప జిల్లా కోర్టుతో పాటు జిల్లాలోని అన్ని కోర్టులలో క్లాస్–4 ఉద్యోగుల కోసం బెల్టులు, బ్యాడ్జీలు సరఫరా చేయు నిమిత్తం ఆసక్తి గల సరఫరా దారుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీదేవి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పంపిణీ రంగంలో అర్హతలు, అనుభవం కలిగిన వారు ఈనెల 30 సాయంత్రం 5 గంటల లోపు తమ దరఖాస్తులను గౌరవ జిల్లా ప్రధాన న్యాయమూర్తి, కడప వారి కార్యాలయంలో సీల్డు కొటేషన్లను సమర్పించవలెనని తెలియజేశారు.

మలంగ్ షాకు సన్మానం

ప్రజాశక్తి - కడప

మలంగ్‌షాను సన్మానిస్తున్న సుభాన్‌బాషా

పెద్ద దర్గా ఉర్సులో భాగంగా మాలాంగ్ షా ఊరేగింపు ముఖ్యమైన భాగం పెద్ద దర్గా నుంచి బయలుదేరి బాదుల్ల సా హెబ్ మకాన్ కు వచ్చిన మలంగ్‌షాను సుభాన్ బాష, వికాస్ విద్యాసంస్థల అధినేత సుల్తాన్ బాబా ఫ్యామిలీ సన్మానించారు. ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో ఉండాలని ఈ సందర్భంగా కోరారు.

వారసత్వ సంపదకు నిలయం వైఎస్ఆర్ జిల్లా

ప్రజాశక్తి - కడప అర్బన్

వైఎస్ఆర్ జిల్లా వారసత్వ సంపదకు నిలయంగా ఉందని భారత జాతీయ కళా సంస్కృతి వారసత్వ పరిరక్షణ సంస్థ (ఇంటాక్) జిల్లా శాఖ కన్వీనర్ లయన్ మానస కె. చిన్నపరెడ్డి అన్నారు. ఆదివారం సంస్థ కార్యాలయంలో ప్రపంచ వారసత్వ దినోత్సవ ముగింపు సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎంతో విలువైన వారసత్వ సంపద ఉందని వాటిని కాపాడుకోవడంలో ఇంటాక్ జిల్లా శాఖ తన బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తుందని తెలిపారు. గండికోట, సిద్ధవటం కోట, ఆదిమానవుని రేఖా చిత్రాలు, జైన బౌద్ధ శిథిలాలతోపాటు ఇక్కడి ఆహార వారసత్వ సంపదను, ఆరోగ్య వారసత్వ సంపదను కాపాడుకునేందుకు ప్రణాళిక బద్ధంగా ముందడుగు వేస్తున్నట్లు తెలిపారు. చరిత్ర ఉపన్యాసకులు బాలగొండ గంగాధర్ మాట్లాడుతూ జిల్లాలో మరి ఎంతో విలువైన వారసత్వ సంపద ఉందని నేటి తరం విద్యార్థులకు వాటి గురించి తెలియజేయవలసిన బాధ్యత మనదేనని చెప్పారు. మాజీ ఎమ్మెల్సీ పోచంరెడ్డి సుబ్బారెడ్డి మాట్లాడుతూ సంపద గురించి తెలియజేసేందుకు ప్రత్యేక ప్రణాళిక అవసరమన్నారు. సీనియర్ ఇంటాక్ సభ్యులు లెక్కల జమాల్ రెడ్డి మాట్లాడుతూ ఎంపిక చేసిన ప్రాంతాలలోని విద్యార్థులకు ఆయా సమీప ప్రాంతాల గురించి తెలియచెప్పే బాధ్యతను అప్పగించాలని కోరారు.

'ఇండ్ల' సేవలు ప్రశంసనీయం : వక్తలు

ప్రజాశక్తి - కడప అర్బన్

మానసిక వైద్యంలో విశేషంగా కృషి చేసి దేశ వ్యాప్తంగా ప్రముఖ వైద్యులుగా గుర్తింపు పొందిన వైద్యులు ఇండ్ల రామసుబ్బారెడ్డి సేవలు అభినందనీయమని, ఆయన మానసిక రోగులకు అందించిన సేవలకు గుర్తుగా వైఎస్ఆర్ లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు వరించడం ప్రశంసనీయమని వక్తలు అన్నారు. ఆదివారం స్థానిక ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాలులో అవార్డు గ్రహీత డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డిని ఆహ్వానసంఘం ఆధ్వర్యంలో ఘనంగా అభినందనసభ నిర్వహించారు. ఆహ్వాన సంఘం అధ్యక్షులు డాక్టర్ సి.బాలిరెడ్డి అధ్యక్షతన జరిగిన సన్మానసభకు ముఖ్య అతిథిగా ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాష హాజరై ప్రసంగించారు. వైఎస్ఆర్ జిల్లాకు చెందిన సామాన్య రైతు కుటుంబంలో జన్మించిన డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి వైద్య రంగంలో రాణించడం జిల్లాకే గర్వకారణమన్నారు. మైదుకూరు ఎమ్మెల్యే రఘురామిరెడ్డి మాట్లాడుతూ డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి, తాను బాల్య మిత్రులమని గుర్తు చేశారు. తమ నియోజకవర్గం మైదుకూరు నియోజకవర్గం గుడిపాడు గ్రామానికి చెందిన ఆయన వైద్య రంగంలో దేశ వ్యాప్తంగా ఖ్యాతి గడించడం ప్రశంసనీయమన్నారు. సన్మాన గ్రహీత డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ తాను వైఎస్ఆర్ జిల్లా గుడిపాడు గ్రామానికి చెందిన వాడినని తెలిపారు. 40 ఏళ్ల కిందట జిల్లా నుంచి అందులోనూ రాయలసీమ ప్రాంతం నుంచి విజయవాడకు వెళ్లాలనని తన వైద్య సేవలకు గుర్తింపుగా ప్రభుత్వం అరుదైన వైఎస్సార్ లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా అందుకోవడం గర్వంగా ఉందన్నారు. అనంతరం ఆహ్వానసంఘం ఆధ్వర్యంలో అవార్డు గ్రహీత డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి, రాధారెడ్డి దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నగర డిప్యూటీ మేయర్ బండి నిత్యానందరెడ్డి, ప్రముఖులు గానుగపెంట హనుమంతరావు, జింకా సుబ్రమణ్యం, ఆదినారాయణరెడ్డి, లెక్కల కొండారెడ్డి, మూల మల్లికార్జునరెడ్డి, విశ్రాంత డిఎస్‌పి సూర్యనారాయణ, సిఐ భాస్కర్‌రెడ్డి, యల్లారెడ్డి పాల్గొన్నారు.

అంతిమ సంస్కారాలకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-చెన్నూరు

స్థానిక పాత గాంధీనగర్‌లో నివసిస్తున్న సుబ్బరాయుడు అనే వ్యక్తి అనారోగ్యం కారణంగా ఇంటి వద్దనే చనిపోయాడు. పేద కుటుంబం కావడంతో అంతిమ సంస్కారాల కోసం వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు గుమ్మరాజేంద్రప్రసాద్‌రెడ్డికి తెలియజేశారు. ఆయన సహృదయంతో స్పందించి పోచిమరెడ్డి ఛారిటబుల్ ట్రస్ట్ తరుపున రూ. 5 వేల ఆర్థిక సాయం ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ పిచ్చయ్య, పంచాయతీ సర్పంచ్ కళ్యాణ్, రజకులు, వైసిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

రక్తదానంతో మరొకరి ప్రాణాన్ని కాపాడొచ్చు

ప్రజాశక్తి - కడప అర్బన్

రక్త దానం చేయడం వల్ల ఒక్క రూపాయి ఖర్చు లేకుండా మనిషి ప్రాణం కాపాడవచ్చుని 30 ఆంధ్ర బెటాలియన్ లెఫ్టినెంట్ కల్నల్ రాజ్ కుమార్ అన్నారు. జెబివిఎస్ ది ప్రెసెర్వర్ సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక తెలుగు గంగ కార్యాలయంలో నిర్వహిస్తున్న ఎన్‌సిసి క్యాంపులో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షులు అశోక్ మాట్లాడుతూ రక్తదానం చేయడం వల్ల ఒక మనిషి ప్రాణాన్ని కాపాడడమే కాకుండా రక్తం శుద్ధి అవుతుందన్నారు. ప్రతి ఒక్కరూ కనీసం ఏడాదికి రెండుసార్లయినా రక్తదానం చేయాలని కోరారు. సేవా దృక్పథంతో ముందుకు వచ్చి రక్తదానం చేసిన ఎన్‌సిసి కేడెట్లను చూస్తుంటే తనకు ఎంతో ఆనందాన్ని ఇస్తుందన్నారు. సంస్థ ఆధ్వర్యంలో 6 నెలలుగా 640కు పైగా యూనిట్స్ బ్లడ్ బ్యాంక్‌కు అందజేశామన్నారు. సహకారం అందించిన ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వారికి, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్‌కు ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎన్‌సిసి అధికారులు మహేష్, . వాలంటీర్ షేక్. అయిషా,ఎస్. సల్మాన్, బి.లక్ష్మీకాంత్, మునివర్ధన్, విద్యార్థులు పాల్గొన్నారు.

రక్తదానం చేసి సర్టిఫికెట్లు చూపుతున్న కేడెట్లు

వైభవంగా కనకదాస జయంతి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పట్టణంలోని కురవ సంఘ ఆధ్వర్యంలో శ్రీశ్రీశ్రీభక్త కనకదాస జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఎంపీ గోరంట్ల మాధవ్, మాజీ శాసనసభ సభ్యులు పార్థసారథి హాజరయ్యారు. ఈ సందర్భంగా కురవ సంఘ నాయకులు వారికి ఘనస్వాగతం పలికారు. అనంతరం శ్రీశ్రీశ్రీ భక్త కనకదాస చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. కురవ సంఘ సంప్రదాయ దుస్తులను ధరించి నృత్యాలు ప్రదర్శించారు. పార్నపల్లి రోడ్డు సిండికేట్ బ్యాంకు వద్ద నుండి కురవ సంఘ నాయకులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎస్ఎన్‌బి కల్యాణమండపంలో కురవ సంఘ నాయకులను ఉద్దేశించి వారు మాట్లాడుతూ కురబల ఆరాధ్య దైవం శ్రీశ్రీశ్రీ భక్త కనకదాస గురించి వివరించారు. పులివెందుల నియోజకవర్గంలోని కురబ కులస్తుల ఆత్మీయతతో ఇంత గొప్ప ర్యాలీ నిర్వహించి గొప్ప పండుగలా చేయడం చాలా అభినందనీయమన్నారు. కురబ కులస్తులంతా ఐక్యతతో ఉంటే దేనినైనా సాధించవచ్చు అన్నారు. రాజకీయంగా ఎదగాలంటే అందరం ఒకేతాటిపై నడవాలన్నారు. కార్యక్రమంలో కురబ కులస్తులు టీచర్ లక్ష్మీనారాయణ, రాష్ట్ర కురబ సంఘ నాయకులు లింగ ప్రసాద్, ఈశ్వరయ్య, మల్లికార్జున, నాగభూషణం, జిల్లా నాయకులు, మహేష్, హరినాథ్, చంద్రశేఖర్, ఎం.హరినాథ్, శివ కొండయ్య, గంగ ప్రసాద్, చంద్రమోహన్, గంగయ్య పాల్గొన్నారు.

ర్యాలీలో పాల్గొన్న ఎంపీ గోరంట్ల మాధవ్

సిఎంకు జిల్లాపై కక్ష ఎందుకో?

ప్రజాశక్తి - వేంపల్లె

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి సొంత జిల్లా వైఎస్ఆర్ కడపపై కక్ష పెంచుకోవడం చాలా బాధాకరమని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి అవేదన వ్యక్తం చేశారు. ఆదివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ రాష్ట్రంపై కసి, జిల్లాపై కక్ష , సొంత నియోజకవర్గమైన పులివెందులపై పగ పెంచుకున్నాడని తెలిపారు. రాష్ట్రంలోని 449 మండలాల్లో కరువు విలయతాండవం చేస్తుంటే.. కంటి తుడుపు చర్యగా కేవలం 103 మండలాలను మాత్రమే కరువుగా ప్రకటించడం శోచనీయమన్నారు. కడప జిల్లాలో 35 మండలాల్లో కరువు రక్కసి ఉండగా ఒక్క మండలాన్ని కూడా కరువుగా ప్రకటించకపోవడం దారుణమన్నారు. రాష్ట్రంలోని 18 జిల్లాలోని 449 మండలాలను కరువుగా ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు.

గౌరీదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు

స్థానిక సంఘం వీధిలో ఉన్న మంగళ గౌరీదేవి ఆలయంలో ఆదివారం కార్తీకపౌర్ణమి మహోత్సవ సందర్భంగా తులసిరెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో తులసిరెడ్డి సతీమణి అలివేలమ్మ, కాంగ్రెస్ నాయకులు ఉత్తన్న, రామకృష్ణ, బాలం సుబ్బరాయుడు, ఆరుశేర్ల సుబ్బరాయుడు, నామా వినయ్ పాల్గొన్నారు.

ఆలయాల్లో కార్తీకపౌర్ణమి శోభ

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని అల్లాడుపల్లె వీరభద్ర స్వామి దేవాలయ ఆవరణలో ఆదివారం సాయంత్రం కార్తీకపౌర్ణమి సందర్భంగా మహిళలు పెద్ద సంఖ్యలో వేడుకలు నిర్వహించారు. సర్పంచ్ జిసి కిషోర్‌కుమార్‌రెడ్డి, ఇఒ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఏర్పాట్లు నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో ఆలయ ఆవరణలో దీపాలు వెలిగించారు. అనంతరం జ్వాలాతోరణం ఏర్పాటు చేసి స్వామివారి గ్రామోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, అయ్యప్పస్వామి భక్తులు మహిళలు పాల్గొన్నారు

ఆలయ ప్రాంగణంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

చక్రాయపేట : మండల కేంద్రంలో వెలిసిన శ్రీ వెంకటేశ్వర, వీరభద్ర, స్వామి దేవాలయ ఆవరణంలో మండల నలుమూలల గ్రామాల నుండి పెద్ద సంఖ్యలో మహిళలు కార్తీకపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. చైర్మన్ మోపూరి రామాంజల్‌రెడ్డి ఆధ్వర్యంలో అక్కడికి విచ్చేసిన వారికి భారీ ఎత్తున అల్పాహారం ఏర్పాటు చేశారు. ముందుగా శ్రీ వెంకటేశ్వర వీరభద్ర స్వామి మూలవిరాట్లకు పలు రకాల పూల అలంకరణతో దేవస్థాన అర్చకుడు అనంత పద్మనాభ చర్మ పూజలు నిర్వహించారు. ధ్వజస్తంభం దీపాన్ని ఆవిష్కరించారు. చక్రాయపేట భజన బృందం భజనలు చేశారు. కార్యక్రమంలో మాజీ చైర్మన్ కర్నాటి హరినాథ్‌రెడ్డి, తంగడపల్లి ఓబుల్‌రెడ్డి, చక్రపాణిరెడ్డి, దేవస్థాన కమిటీ సభ్యులు రంగారెడ్డి, నరసింహులు, యోగేశ్వర్‌రెడ్డి, పెంచలయ్య, రామచంద్రారెడ్డి, ఈశ్వరయ్య, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ధ్వజస్తంభం వద్ద పూజలు చేస్తున్న నిర్వాహకులు

గండి క్షేత్రంలో పవిత్రోత్సవాలు

ప్రజాశక్తి - చక్రాయపేట

జిల్లాలో ప్రసిద్ధి చెందిన గండి వీరాంజనేయ స్వామి సన్నిధిలో పవిత్ర ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్తీక మాసంలో జరిగే పవిత్రోత్సవాల్లో మూడవ రోజు పలు కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో చైర్మన్ పినుప్రోలు రాఘవేంద్ర ప్రసాద్, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ అలవలపాటి ముకుంద రెడ్డి, అర్చకులు పాల్గొన్నారు.

విలేకరి లక్ష్మణ్ మృతికి పలువురు నివాళులు

ప్రజాశక్తి - దువ్వూరు

దువ్వూరు మండల ఆంధ్రజ్యోతి పాత్రికేయుడు వైకుంఠం లక్ష్మణ్ (38) మృతికి ఆదివారం పలువురు నివాళు లర్పించారు. లక్ష్మణ్ మృతదేహాన్ని టిడిపి రాష్ట్ర మాజీ కార్యనిర్వాహక కార్యదర్శి రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, టిడిపి సీనియర్ నేత రెడ్యం చంద్రశేఖర్‌రెడ్డి, దువ్వూరు సింగిల్ విండో మాజీ అధ్యక్షులు తుమ్మల మస్తాన్‌రెడ్డి సందర్శించి నివాళులర్పించారు. లక్ష్మణ్ బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందారు. లక్ష్మణ్ నాయుడుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.


లక్ష్మణ్ (ఫైల్‌ఫొటో)

సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులుగా లక్ష్మీనారాయణ

లక్కిరెడ్డిపల్లి : ఉమ్మడి కడప జిల్లా సర్పంచులసంఘం కమిటీ అధ్యక్షుడిగా అన్నమయ్య జిల్లా కొనంపేట సర్పంచ్ లక్ష్మీనారాయణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సర్పంచ్‌ల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు యలమంచిలి రాజేంద్రప్రసాద్ ప్రకటించారు. ఆదివారం తిరుపతిలో కోలా రెసిడెన్సీలో జరిగిన రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం సమావేశంలో ఆయన ఈ విషయం వెల్లడించారు. జిల్లా కమిటీ అధ్యక్షుడుగా నన్ను ఎన్నుకున్నందుకురాజేంద్రప్రసాద్‌కు, రాయచోటి టిడిపి ఇన్‌ఛార్జి అర్.రమేశ్‌కుమార్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

'పిఎంజెఎవై'ని సద్వినియోగం చేసుకోవాలి

రామాపురం : మండలంలోని గువ్వలచెరువు, కసిడ్డిగారిపల్లి, సూర్యనారాయణపురం గ్రామంలోని సచివాలయంలో ఆదివారం ఎంపిడిఒ హైదర్‌వల్లి అధ్యక్షతన భారతసంకల్ప యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఒ డాక్టర్ కొండయ్య పాల్గొని లబ్ధిదారులకు ప్రధానమంత్రి జనఆరోగ్య యోజన హెల్త్ కార్డులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోనే అతి పెద్ద ఇన్సూరెన్స్ పథకం పిఎంజెఎవైఅని ఈ ఇన్సూరెన్స్ వల్ల ప్రతీ కుటుంబానికి ఐదు లక్షల భీమా వర్తిస్తుందని తెలిపారు. వైద్య శిబిరము నిర్వహించి 189 మందికి చికిత్స చేసి మందులు పంపిణీ చేశారు. క్షయ వ్యాధి స్క్రీనింగ్‌లో అనుమానితులను 19 మందిని పరీక్షల నిమిత్తం రెఫర్ చేశామన్నారు. టిబి.ముక్త్ భారత్ క్షయ రోగులకు పరీక్షలు, మందులు పూర్తిగా ఉచితంగా ఇస్తామని చికిత్స కాలంలో మంచి పౌష్టికాహారం నిమిత్తం రోగికి రూ.500 వారి ఖాతాలో జమ చేస్తామని చెప్పారు.

15 నుంచి 'ఆడుదాం ఆంధ్ర' క్రీడా పోటీలు

నేటి నుంచి సచివాలయాల్లో పేర్లు నమోదు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

15 ఏళ్ల పైబడిన వారి కోసం డిసెంబరు 15 నుంచి ఆడదాం ఆంధ్ర పేరుతో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ కృష్ణమూర్తి తెలిపారు. ఆ మేరకు శనివారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రికెట్, వాలీబాల్, కోకో, కబడ్డీ, బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. క్రీడాకారులు ఈనెల 27వ నుంచి సచివాలయాల్లో రిజిస్ట్రేషన్‌ను చేయించుకోవాలన్నారు. 15 ఏళ్ల పైబడిన గ్రామీణ ప్రాంత క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ క్రీడా పోటీలు డిసెంబర్ 15 నుంచి 20 తేదీ వరకు సచివాలయ పరిధిలో ఉంటాయన్నారు. 21 నుంచి జనవరి 4వ తేదీ వరకు మండల స్థాయిలోనూ, జనవరి 5 నుంచి 10వ తేదీ వరకు నియోజవర్గ స్థాయిలోనూ, జనవరి 11 నుంచి 21 వరకు జిల్లాస్థాయిలో, జనవరి 22 నుంచి 26 వరకు రాష్ట్రస్థాయిలో పోటీలు నిర్వహిస్తారన్నారు. ఈ అవకాశాన్ని గ్రామీణ ప్రాంత క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ కోరారు.

ప్రభుత్వ కళాశాల్లో ప్రాక్టీస్ చేస్తున్న క్రీడాకారులు..

ప్రభుత్వం నిర్వహించనున్న ఆడదాం ఆంధ్ర క్రీడ పోటీల్లో పాల్గొనడానికి కళాశాల విద్యార్థులు ఆయా క్రీడల్లో ప్రావీన్యం పొందేందుకు ప్రాక్టీస్ చేస్తున్నారు. నిడివెలగల సమీపంలోని ప్రభుత్వ పాలిటెక్ని కళాశాలలో విజయం సాధించాలని లక్ష్యంతో ఆయా క్రీడల్లో ప్రాక్టీస్ చేస్తున్నారు.

పాలిటెక్నిక్ కళాశాలలో ప్రాక్టీస్ చేస్తున్న క్రీడాకారులు

వెంకన్న సాక్షిగా ఇచ్చిన హామీలు అమలు చేయని మోడీ

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

రాష్ట్ర విభజన తర్వాత ఎన్నికల్లో తిరుపతి వెంకన్న సాక్షిగా ప్రత్యేకహోదా, కడప ఉక్కును ఇస్తామని నరేంద్ర మోడీ, అమిత్ షా చెప్పి మాట తప్పారని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ తెలిపారు. స్థానిక ఎన్జీఓ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత ఎన్నికల ప్రచారంలో భాగంగా తిరుపతి సాక్షిగా బిజెపి అధికారంలోకి వస్తే ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇస్తామని, కడప ఉక్కు తెస్తామని హామీలిచ్చారని గుర్తు చేశారు. వాటిని ఇప్పటివరకు ఎందుకు అమలు చేయలేదో చెప్పి, రాష్ట్ర ప్రజలకు క్షమాపణలు చెప్పాలన్నారు. మళ్లీ ఇప్పుడు ప్రధాని మోడీ తిరుపతికి రావడం ఇక్కడి ప్రజలను మరోమారు మోసం చేయడమేనని విమర్శించారు. కర్నూల్‌లో చేసిన బిజెపి రాయలసీమ డిక్లరేషన్ ఏమైందన్నారు. కరువు కోరల్లో చిక్కుకున్న రాయలసీమ ప్రాంతం విముక్తి కడప ఉక్కు పరిశ్రమ అన్నారు. ఉక్కు పరిశ్రమపై కేంద్రం శీతకన్ను వేసిందన్నారు. ఎదిరించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం వద్ద మెడలు వంచి స్వప్రయోజనాల కోసం రాష్ట్ర భవిష్యత్‌ను తాకట్టు పెడుతోందన్నారు. సమావేశంలో డివైఎఫ్ఐ పట్టణ ఉపాధ్యక్షులు ప్రసాద్, మహేష్ పాల్గొన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న శివకుమార్

'ప్రతి కుటుంబ ఆర్థికాభివృద్ధికి హామీ'

గ్యారంటీ పత్రాలను పంచుతూ హామీలను విస్తరిస్తున్న భూపేష్‌రెడ్డి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

రాష్ట్రంలోని ప్రతి కుటుంబ ఆర్థికాభివృద్ధికి టిడిపి-జనసేన కలిసి హామీ ఇస్తున్నాయని జమ్మలమడుగు టిడిపి ఇన్‌ఛార్జి చదిపిరాళ్ళ భూపేష్ సుబ్బరామిరెడ్డి అన్నారు. జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని కన్నెలూరులో ఆదివారం భవిష్యత్తుకు గ్యారంటీ హామీ పత్రాలను (బాండ్) పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు అధికారంలోకి వస్తే అన్ని వర్గాల వారికి ప్రయోజనం చేకూర్చేలా సూపర్ సిక్స్ పేరుతో మినీ మేనిఫెస్టో విడుదల చేశారన్నారు. ఇందులో మహిళలకు, రైతులకు, నిరుద్యోగులకు, పిల్లలను స్కూల్స్‌కు పంపే తల్లులకు పథకాలు ప్రవేశ పెట్టారన్నారు. ఆ పథకాల ద్వారా ఎంత లబ్ధి చేకూరుతుందో ఒక పత్రం మీద రాసి ప్రతి ఇంటికీ అందజేస్తున్నామన్నారు. రానున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటు వేసి తనను ఎమ్మెల్యేగా, చంద్రబాబును ముఖ్యమంత్రిగా గెలిపించాలని భూపేష్‌రెడ్డి కోరారు. అనంతరం పాతబస్టాండ్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. భారతదేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పిన మన రాజ్యాంగం ఆమోదం పొంది నేటికీ 74ఏళ్లు పూర్తయిందన్నారు. ఈ సందర్భంగా జమ్మలమడుగు నియోజకవర్గం ప్రజలందరికీ ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ప్రమాదవశాత్తూ మరణించిన పార్టీ సీనియర్ కార్యకర్త సుంకసుల ఐజయ్యకు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి శ్రీనివాసులు, నవనీశ్వర్‌రెడ్డి, నెల్సం కుమార్, జయచంద్ర, ఫిలిప్, మద్దిలేటి, కొండయ్య, దస్తగిరి, మునిస్వామి, రసూల్ నాయక్, అలీ, చెన్నయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చాపాడు : మైదుకూరు మండలం పప్పనపల్లె పంచాయతీలోని ఓబుళాపురంలో ఆదివారం టిడిపి ఇన్‌ఛార్జి పుట్టా సుధాకర్ యాదవ్ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ.. భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రతి ఇంటికి వెళ్లి టిడిపి మినీ మేనిఫెస్టోలోని పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా పప్పనపల్లి గ్రామంలో కొంతమంది నాయకులు టిడిపిలో చేరారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు భీమయ్య, వెంకటసుబ్బయ్య, నాయకులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : అభివృద్ధి, సంక్షేమం మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే సాధ్యమని ప్రొద్దుటూరు టిడిపి ఇన్‌ఛార్జి ప్రవీణ్ కుమార్ రెడ్డి సతీమణి మౌనిక పేర్కొన్నారు. ఆదివారం రూరల్ పరిధిలోని పెద్దశెట్టిపల్లె పంచాయతీ కొత్తపేట గ్రామంలో బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకి గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ప్రజలకు వివరిస్తూ మౌనిక, హరిత కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ బండి భాస్కర్‌రెడ్డి, రూరల్ మండల కన్వీనర్ బోడెల బాబుల్‌రెడ్డి, నరసింహారెడ్డి, హుస్సేన్‌రెడ్డి, నరసింహారెడ్డి, కృష్ణారెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, బూత్ కన్వీనర్ మస్తాన్ రెడ్డి, చంద్రరెడ్డి, రవీంద్రానాథ్ రెడ్డి, అశోక్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, వెంకట సుబ్బారెడ్డి, బి బాబయ్య, టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఘనంగా భారత రాజ్యాంగ దినోత్సవం

ప్రజాశక్తి - వేంపల్లె

ట్రిపుల్‌ఐటి క్యాంపస్ లో రాజ్యాంగ ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

రాజ్యాంగ రూపకల్పనలో కీలక పాత్ర డాక్టర్ బిఆర్ అంబేద్కర్ వహించారని పరిపాలన అధికారి రాంభూపాల్‌రెడ్డి, ప్రో గ్రాం అధికారి డాక్టర్ తిరుపతిరెడ్డి అన్నారు. ఆదివారం మండ లంలోని ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటిలో జాతీయ సేవా సమితి, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు డాక్టర్ విశ్వనాథరెడ్డి, డాక్టర్ రమేష్, కో-ఆర్డినేటర్ డాక్టర్ మధుసూదన్, ఎన్ఎస్ఎస్ వాలింటీర్లు, ట్రిపుల్‌ఐటి విద్యార్థులు పాల్గొన్నారు. **జమ్మలమడుగు రూరల్ :** భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని జమ్మలమడుగు పట్టణం నాగులకట్ట బుడుగజంగం వీధిలో ఆదివారం అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎస్‌సి, ఎస్‌టి మానిటరింగ్ కమిటీ సభ్యులు మేకల ఆంజ నేయులు మాట్లాడుతూ భారత ప్రధాని నరేంద్ర మోడీ సర్కార్ 2015 నవం బర్ 19న అధికారికంగా గెజిట్ నోటిఫికేషన్ ద్వారా నవంబర్ 26ని జాతీయ రాజ్యాంగ దినోత్సవంగా ప్రకటించిందన్నారు. కార్యక్రమంలో ఎంఎస్‌పి నాయకులు సుబ్బగాల్ల నరసింహులు, ఎస్‌సి, ఎస్‌టి అసోసి యేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మేసా గోపాల్, కందికుంట గంపయ్య, కిరణ్, శివ, శంకర్, సుబ్బమ్మ పాల్గొన్నారు.

విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న కళాశాల యాజమాన్యం

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : రాణి తిరుమల దేవి డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ చంద్ర శేఖర్‌రెడ్డి, కరస్పాండెంట్ తారునేందు శేఖర్ మాట్లాడుతూ రాజ్యాంగం రూపకర్త డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురించి వివరించారు.

కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్, వైస్ ప్రిన్సిపల్ వెంకటేశ్వర్ రెడ్డి, ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్, విద్యార్థులు పాల్గొన్నారు. **పులివెందుల టౌన్ :** భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ వైసిపి ఇన్‌ఛార్జి వైయస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ ఆధ్వర్యంలో పట్టణ పరిధిలోని పాత బస్టాండ్ కూడలి వద్ద డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ సేవల గురించి పలువురు కొనియాడారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్నప్ప, వైస్ చైర్మన్ హాఫీజుల్లా, సివిల్ సప్లయ్ డైరెక్టర్ హాల్ గంగాధర్ రెడ్డి, కౌన్సిలర్ పార్లపల్లి కిషోర్, వెంకటరమణ, కో-ఆప్షన్ సభ్యుడు చంద్రమౌళి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **జమ్మలమడుగు :** ప్రపంచ మేధావి రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అని జమ్మలమడుగు మండలం కాంగ్రెస్ అధ్యక్షులు మంచాల పుష్పరాజు, టౌన్ ప్రెసిడెంట్ రాజేష్ పేర్కొన్నారు. ఆదివారం రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మహేష్, నాయుడు, చెన్నకేశవరెడ్డి, సంజయ్, ప్రవీణ్‌కుమార్, మెరుగు సుబ్బరాయుడు, డింపు, పుష్పరాజు, క్రిష్టఫర్ పాల్గొన్నారు. **ప్రొద్దుటూరు :** భారత రాజ్యాంగాన్ని ఆమోదించి నేటికి 74 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. పట్టణంలోని పాతబస్టాండు ప్రాంతంలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాదరెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మిదేవి, మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు గోస మనోహర్ పాల్గొన్నారు.

జమ్మలమడుగు రూరల్ : అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కమిటీ సభ్యులు

ఒపిఎస్ అమలు చేసేవారికే మద్దతు

ప్రొద్దుటూరు : ఒపిఎస్ అమలు చేసే వారికే తమ మద్దతుంటుందని మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి అన్నారు. స్థానిక ఎన్జీఓ హోంలో ఆదివారం ఎస్టీయు రీజనల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వారంలోనే సిపిఎస్ రద్దు చేసి ఒపిఎస్‌ను అమలుచేస్తామని చెప్పిన ముఖ్యమంత్రి మాట తప్పారని తెలిపారు. 30ఏళ్లకు పైబడి ప్రభుత్వానికి, ప్రజలకు సేవ చేసిన ఉద్యోగులు ఉద్యోగ విరమణ తర్వాత జీవితాలకు భద్రత కల్పించే పెన్షన్ ఇవ్వడం ప్రభుత్వాల బాధ్యత అని చెప్పి, ఇప్పుడు ఆరోజు అవగాహన లేక హామీ ఇచ్చామని మాటమార్చడం అన్యాయమన్నారు. తమ న్యాయమైన కోరికను అంగీకరించకపోతే మరో ఛలో విజయవాడ వంటి ఉద్యమాలు పునరావృతమవుతాయని హెచ్చరించారు. రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి మాట్లాడారు. అనంతరం ప్రొద్దుటూరు రూరల్, అర్బన్, రాజుపాలెం, చాపాడు మండలాలకు నూతన కార్యవర్గాలను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. రీజనల్ కన్వీనర్ డి.సలీం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కత్తి నరసింహారెడ్డి

యువతతోనే దేశాభివృద్ధి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ఆరోగ్యవంతమైన యువత దేశాభివృద్ధికి ఎంతో అవసరమని ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాదరెడ్డి అన్నారు. శుక్ర, శనివారాల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఓపెన్ జెకెడి కుంగుఫూ కరాటే ఛాంపియన్‌షిప్ 2023 పోటీ ప్రొద్దటూరులో జరిగాయి. విజేతలకు ఎమ్మెల్యే ఆదివారం స్థానిక జార్జిక్లబ్‌లో బహుమతి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్మరక్షణ, దేహదారుఢ్యం, మానసిక వికాసానికి యువత ఇలాంటి క్రీడల పట్ల ఆసక్తిని కలిగి ఉండి విజేతలుగా రాణించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మిదేవి, కుంగుఫూ మాస్టర్ సొహైల్, విజేతల తల్లిదండ్రులు, ఔత్సాహికులు పాల్గొన్నారు.

క్రీడా విజేతలతో ఎమ్మెల్యే రాచమల్లు

ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు

పెనికలపాడు వైసిపి నాయకులు అట్ల భాస్కర్‌రెడ్డి

ప్రజాశక్తి - ముద్దనూరు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నారని పెనికలపాడు వైసిపి నాయకులు అట్ల భాస్కర్‌రెడ్డి, ఉప సర్పంచ్ అట్ల భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. 'ప్రజాశక్తి'తో వారు మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కులమతాలు, పార్టీలకు అతీతంగా సంక్షేమ ఫలాలను అందిస్తూ జగన్ అండగా నిలుస్తు న్నారన్నారు. రాష్ట్రాభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. ప్రజల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్నట్లు చెప్పారు. పారదర్శకంగా పాలన సాగిస్తూ ఆదర్శ ముఖ్యమంత్రిగా జగన్ పేరు తెచ్చుకున్నారని వారు కొనియాడారు. ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే ఆదర్శ రాష్ట్రంగా తీర్చి దిద్దుతున్నారన్నారు. సిఎం, ఎంపీ అవినాష్‌రెడ్డి సహాయ సహకారాలతో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి జమ్మలమడుగు నియోజకవర్గ అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి పాటు పడుతున్నారన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు మరింత చేరువ చేస్తామన్నారు. గ్రామ పంచాయతీ పరిధిలోని గ్రామాల అభివృద్ధికి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. వైసిపి బలోపేతానికి అహర్నిశలు పాటుపడుతామన్నారు. రానున్న ఎన్నికల్లో వైసిపి మళ్ళీ అధికారంలోకి వచ్చేందుకు శాయిశక్తులా కృషి చేస్తామని వారు తెలిపారు. వైసిపి ప్రభుత్వం ప్రజలదని సిఎం జగన్ నిరూపించారన్నారు.

గుడిపాడులో భోజనశాల ప్రారంభం

ప్రజాశక్తి - దువ్వూరు

మండల పరిధిలోని గుడిపాడు గ్రామంలో ఉన్న శ్రీ సీతారాముల దేవస్థానం ఆవరణలో భోజనశాలను ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మైదుకూరు ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి, మైదుకూరు టిడిపి ఇన్‌ఛార్జి పుట్టా సుధాకర్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విజయవాడలో ఉన్న గుడిపాడు గ్రామానికి చెందిన ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి తన తల్లిదండ్రుల పేరుతో భోజనశాల నిర్మించడం చాలా సంతోషంగా ఉందని వారన్నారు. కార్యక్రమంలో రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, ప్రముఖులు పాల్గొన్నారు

నేడు మైదుకూరులో జాబ్ మేళా

ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరు పురపాలక పరిధిలో సోమవారం ఎంపిడిఒ కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ రంగస్వామి తెలిపారు. డిక్సన్ కంపెనీలో అసెంబల్ అసిస్టెంట్ పోస్ట్‌లకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 10వ తరగతి పాస్ అయిన మహిళలకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. మైదుకూరు నుండి కొప్పర్తి పారిశ్రామికవాడ వరకు బస్సు సౌకర్యంతోపాటు రూ.15వేల వేతనం ఇస్తారన్నారు. మైదుకూరు పురపాలక పరిధిలోని మహిళా అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ప్రజల కోసం నిరంతరం పనిచేసే సిఎం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

రాష్ట్ర ప్రజల కోసం పనిచేసే ఏకైక నాయకుడు సీఎం జగన్మోహన్‌రెడ్డి అని జేసీసీ కన్వీనర్, కౌన్సిలర్ పార్నపల్లి కిషోర్ పేర్కొన్నారు. అహోబిలాపురం కాలనీలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో భాగంగా ఆయన ప్రతి ఇంటికి వెళ్లి జగనన్న సంక్షేమ పథకాలు నెరవేర్చిన హామీల గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు, సచివాలయం కన్వీనర్లు ఈశ్వరయ్య, గండి ఆంజనేయులు, గృహ సారథులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో జడ్‌పిటిసి పాత్ర కీలకం

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లె మండలాభివృద్ధికి జడ్‌పిటిసి రవికుమార్‌రెడ్డి ఎనలేని కృషి చేశారని వైసిపి మండల బిసి సెల్ ప్రధాన కార్యదర్శి నల్లమేకల కృష్ణయ్య తెలిపారు. జడ్‌పిటిసి రవికుమార్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలను ఆదివారం వైసిపి నేతలు ఘనంగా నిర్వహించారు. చింతల మడుగుపల్లె బైపాస్ రోడ్డులో నల్లమేకల కృష్ణయ్య ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. పార్టీ కార్యకర్తలకు స్వీట్స్ పంపిణీ చేశారు. రాజీవ్‌నగర్ కాలనీలో ఉన్న మదర్ థెరిస్సా అనాథ వృద్ధాశ్రమంలో సాయి మణికంఠ ఫ్యాషన్ షోరూం యజమాని సాయి మణికంఠ, బాలస్వామిరెడ్డి, మాజీ సర్పంచ్ ఉత్తయ్య ఆధ్వర్యంలో రూ.4 వేలు విలువ చేసే నిత్యవసర సరుకులను ఆశ్రమ నిర్వాహకుడు వెంకట సుబ్బయ్యకు అందజేశారు. అమ్మగారిపల్లె గ్రామ వైసిపి నేత ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో వృద్ధులకు రెండు పూటల అన్నదానం చేశారు. కేరళ రాష్ట్రంలోని శబరిమలైలో రవికుమార్‌రెడ్డి సమక్షంలో అయ్యవారిపల్లి సర్పంచ్ రామగంగిరెడ్డి, మాజీ సర్పంచ్ ప్రసాద్‌రెడ్డి, సోమేశ్వరరెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, ముతుకూరు శ్రీనువాసులురెడ్డి, వేణుగోపాల్ రెడ్డి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో కొండారెడ్డి, కల్లూరు సుబ్బారెడ్డి, పద్మా రాజ్‌కుమార్, భాస్కర్‌రెడ్డి, చలమారెడ్డి, మండల కో-ఆప్షన్ అసనయ్య, ఎంపిటిసి రహంతుల్లా ఖాన్, గుజిరి దర్బార్, జిల్లా వక్ఫ్ బోర్డు సభ్యుడు ఖదీర్ పాల్గొన్నారు.

కేక్ కట్ చేస్తున్న నల్లమేకల కృష్ణయ్య

అలరించిన చిన్నారుల నృత్యాలు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పట్టణంలోని శిల్పారామంలో చిన్నారుల నృత్యాలు ప్రేక్షకులను ఎంతగానో అలరించాయి. ఆదివారం సాయంత్రం శ్రీ సూర్య డాన్స్ అకాడమీ మదనపల్లె వారి చిన్నారులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయ. కార్యక్ర మంలో శిల్పారామం పరిపాలన అధికారి సుధాకర్, మా ఊరు సినిమా హీరో మహేష్, డ్యాన్స్ మాస్టర్ సూర్య పాల్గొన్నారు.

నృత్యాలు చేస్తున్న చిన్నారులు

29న సహాయ పరికరాల పంపిణీ

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి సహకారంతో పులివెందుల నాలుగు రోడ్ల కూడలి, గాంధీ సర్కిల్ సమీపంలోని అహోబిలపురం మెయిన్ ఉన్నత పాఠశాలలో ఈనెల 29న విభిన్నప్రతిభావంతులకు సహాయ పరికరాలు పంపిణీ శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఇరికిరెడ్డి రఘునాథరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో దాదాపు 7వందల మందికి పైగా అందజేస్తారని తెలిపారు. అర్హుల వివరాలు సచివాలయాలు, వాలంటీర్లు, ఎంపిడిఒ వద్ద ఉంటాయన్నారు. నియోజకవర్గంలోని పులివెందుల మున్సిపాలిటీ, రూరల్, లింగాల, తొండూరు, వేముల, వేంపల్లి, చక్రాయపేట మండలాల లబ్ధిదారులు హాజరుకావాలన్నారు. వివరాలకు 92473 39815 సెల్ నంబర్‌ను సంప్రదించాలని ఆయన సూచించారు.